స్థాపితం : 1930
LONGEST LIVING NEWSPAPER IN TELUGU JOURNALISM
స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు
జీవప్రదాత : నెల్లూరు శ్రీరామమూర్తి




# జమీన్ రైతు




సంపుటి : 80 సంచిక : 26 12-6-2009 శుక్రవారం 16 పేజీలు విడి ప్రతి : రూ. 5/-

# వైఎస్ నిజస్వరూపం మరోసారి బట్టబయలు!

**"అసెంబ్లీలో చివరిరోజు ముఖ్యమంత్రి చేసిన ప్రసంగం ఆయన రాజకీయ ఫ్యాక్షన్ ధోరణిని ప్రతిబింబించిందని స్వంత మనుషులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు కూడా అభిప్రాయపడుతున్నారు.**

శాసనసభ సమావేశాలలో చివరిరోజు టిఆర్ఎస్ మీద, కెసిఆర్ మీద ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జరిపిన మాటల దాడి, అటు ప్రతిపక్షంలో, ఇటు స్వపక్షంలోనూ ఒక విధమైన భయం రేకెత్తించింది. నిజానికి ఈ అసెంబ్లీ సమావేశాలలో ప్రతిపక్ష పార్టీలన్నీ చాలా సంయమనంతో వ్యవహరించాయి. చంద్రబాబు కూడా శాపనార్థాలు మాని సలహాలు చెప్పే తీరులో మెత్తగా మాట్లాడారు. ఒక్క ఆరోపణ చేయలేదు. ఒక్క విమర్శకు సాహసించలేదు. ప్రజారాజ్యం అధినేత చిరంజీవి ఉపన్యాసమైతే, అందరి మన్ననలు పొందింది. నిర్మాణాత్మక ప్రతిపక్షం అంటే ఎట్లా వుండాలో తన మాటలలో ధ్వనింపచేశాడు చిరంజీవి. టిఆర్ఎస్, సిపిఎం వంటి పార్టీలు అసలు నోరెత్తి మాట్లాడలేదు. అయినాసరే ముఖ్యమంత్రి మాత్రం టిఆర్ఎస్ మీద విరుచుక పడ్డాడు. అసలు చర్చకే రాని తెలంగాణా సమస్యను ప్రస్తావించడంలోనే ఆయన ఒక నిర్దిష్టమైన లక్ష్యంతో, ముందుగా వేసుకొన్న ప్రణాళికతో ఈ దాడికి పూనుకొన్నారని అందరికీ అర్థమైపోయింది. అందుకు మూడు కారణాలు కన్పిస్తున్నాయి. మొదటిది, ఎన్నికల ప్రచారంలో తన మనసు గాయపడేట్లుగా కెసిఆర్ చేసిన వ్యాఖ్యలకు ప్రతీకారం తీర్చుకోవడం. రెండవది, తెలంగాణా కాంగ్రెస్‌వాదులు నోరెత్తి మాట్లాడే ధైర్యం చేయకుండా కఠిన హెచ్చరిక చేయడం. మూడవది, హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో తెలంగాణావాదాన్ని వ్యతిరేకించే వారిని ఆకట్టుకోవడం.



ఒకే ఒక్క ఉపన్యాసంతో ఈ మూడు లక్ష్యాలను సమర్థవంతంగా సాధించుకొన్నాడు ముఖ్యమంత్రి. స్థానిక ఎన్నికల నాటికి టిఆర్ఎస్ అనేది ఒక పార్టీగా ఉనికి నిలబెట్టుకోకూడదన్నది ఆయన అభిమతం. ఇనుము వేడిగా వున్నప్పుడే వంగదీయాలన్న సూక్తి ప్రకారం, కొనవూపిరితో మిగిలిన ఆ పార్టీ తిరిగి లేవకుండా అణగదొక్కితే ఇక ఇప్పట్లో తెలంగాణా అన్న ప్రసక్తే విన్పడకుండా పోతుందని ఆయన భావన. ముఖ్యమంత్రి ప్రసంగం తెలుగుదేశంపార్టీని కూడా ఇరకాటంలో పెట్టింది. టిఆర్ఎస్‌తో ఎన్నికల పొత్తు కొనసాగించడానికి చంద్రబాబు సాహసించకుండా అదురు దెబ్బ కొట్టాడు ముఖ్యమంత్రి. కెసిఆర్‌ను ఆంధ్రాద్వేషిగా, అరాచకవాదిగా జనం మనసులలో ముద్రవేస్తే, ఆ పార్టీతో పొత్తు పెట్టుకోవడానికి ఏ పార్టీ కూడా ముందుకు రాదు కదా?

కెసిఆర్‌తో పాటుగా కాంగ్రెస్‌తో సహా అన్ని పార్టీలలో వున్న తెలంగాణా శక్తులను నిర్వీర్యం చేయాలన్నది ముఖ్యమంత్రి అభిమతం. అందుకు శాసనసభను ఒక వేదికగా వాడుకొన్నాడాయన. తన ఇష్టానికి వ్యతిరేకంగా మాట్లాడేవారు, ప్రవర్తించేవారు ఎవరైనా సరే సహించే ప్రశ్న లేదని, ఎంత దూరమైనా వెళ్తానని ఒక హెచ్చరిక జారీ చేశాడు ముఖ్యమంత్రి. అది కాంగ్రెస్‌వాదులకు కూడా వర్తిస్తుంది. రానున్న ఐదేళ్ల పాటు అటు ప్రతిపక్షం, ఇటు స్వపక్షం కూడా తనకు అణిగిమణిగి పడి వుండాలన్నది కోరిక.

ముఖ్యమంత్రి ప్రసంగం రాయలసీమ ఫ్యాక్షన్ ధోరణికి ప్రతిబింబమని అందరూ అంగీకరిస్తున్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయి ఆంగ్ల దినపత్రిక కూడా నేరుగా ఆ మాట వ్రాసేసింది. తన ఫ్యాక్షన్ మనస్తత్వాన్ని నగ్నంగా బయటపెట్టాడని వ్యాఖ్యానించింది. ముఖ్యమంత్రి స్వంత మనుషులు, అనుచరులు కూడా ఆ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నారు. బెదరింపు వైఖరితో, తన జోలికి వస్తే తాట తీస్తాననే హెచ్చరికతో పరిపాలన చేయడం ఆయన ఉద్దేశంగా కన్పడుతున్నదని చర్చించుకొంటున్నారు. ఇప్పటికే జెసి.దివాకర్‌రెడ్డి, జానారెడ్డిలను మంత్రివర్గానికి దూరం పెట్టడం ద్వారా తాను తలచుకొంటే ఎవరినైనా అణగద్రొక్క గలననే సంకేతం ఇచ్చాడు ముఖ్యమంత్రి. ఈ ప్రసంగం ద్వారా ఆ సందేశాన్ని మరింత పచ్చిగా లోకానికి చాటి చెప్పాడు.

## ముఖ్యమంత్రి ప్రాపకానికి ప్రతిపక్షం ప్రాకులాట

ఇదిట్లావుంటే, మరొకప్రక్క ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి ప్రాపకం కోసం ప్రాకు

తరువాయి 14వ పేజీలో






# ఫలించని బ్యాంకు దోపిడీల పథకం



పట్టుకొన్న దొంగలతో పోలీసులు.

అనుకొన్నదొక్కటి: అయినదొకటి అన్నట్లు ఓ హత్యకేసులో నుంచి బయట పడను పెద్దమొత్తంలో దోపిడీ చేయాలనుకొన్న ఇద్దరు వ్యక్తులు కాలం కలసి రాక పోలీసులకు చిక్కిపోయారు. కప్పరాళ్లతిప్పకు చెందిన పేరుమోసిన గజ దొంగ మారుబోయిన మాల్యాది ఓ చోరీ కేసులో అరెస్ట్ అయ్యి గత ఎనిమిది నెల

## పోలీసులకు చిక్కిన నిందితులు

లుగా నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్‌లో వున్నాడు. ఈ మధ్య నెల్లూరులో జరిగిన ప్రజారాజ్యం పార్టీ నేత రమేష్ హత్యకేసులో నిందితుడు సునీల్ కుమార్‌రెడ్డి మాల్యాదికి జైలులో పరిచయం ఏర్పడింది. తాను హత్య కేసు నుంచి బయటపడను 10లక్షలు అవసరమని సునీల్‌కుమార్‌రెడ్డి చెప్పగా, తనను విడుదల చేయిస్తే ఆ మొత్తాన్ని సమకూర్చే బాధ్యత స్వీకరిస్తానని మాల్యాది భరోసాయిచ్చాడు. దీంతో సునీల్ అతడ్ని తన స్వంత ఖర్చులతో బెయిల్‌పై విడుదల చేయించాడు. అప్పటినుంచి మాల్యాది బ్యాంక్ దోపిడీకి పథకం రచించాడు. మే 16తేది పోలీసులు ఎన్నికల కౌంటింగ్ డ్యూటీలో వుండగా కోవూరు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో దోపిడీకి ప్రయత్నించి విఫలమయ్యారు. అప్పటి నుంచి జిల్లాలోని పలు బ్యాంకుల దోపిడీకి వీరిద్దరూ మోటార్ సైకిళ్లపై తిరగనారంభించారు. ఈ సమాచారం తెలుసుకొన్న నెల్లూరు బాల్హాజీనగర్ పోలీసులు వీరిపై దాడి చేసి చోరీ కోసం సిద్ధం చేసిన ఆక్సిజన్ గ్యాస్ సిలిండర్, కట్టర్, నాజర్, వైర్ కట్టర్లు, కలర్ టివిలతోపాటు సందట్లో సడేమియాగా దొంగలించిన బంగారు,

తొరవ 14వ పేజీలో



గ్రామీణ ప్రాంతాల్లో బాగా దెబ్బతినిపోయిన రోడ్లు.

# నాబార్డు నిధులతో రోడ్లు, భవనాలు!

జిల్లాలో రోడ్లు, మండల పరిషత్ భవనాలకు కొత్తకళ రాబోతుంది. జిల్లాలో అధ్వాన్నంగా వున్న రోడ్లను పునర్నిర్మించడం, మండల పరిషత్‌లకు స్వంత భవనాలను కట్టేందుకు నాబార్డ్ దాదాపు 40 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. జిల్లాలో ఇంకా పలు మండల పరిషత్ కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. వీటికి లక్షలాది రూపాయల అద్దెను ప్రభుత్వం నెలనెలా చెల్లిస్తుంది. మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణాలను చేపట్టేందుకు జిల్లా పరిషత్ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేకశ్రద్ధ తీసుకొని ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారు. తన పదవీ కాలంలోనే ఈ భవనాలను ప్రారంభించాలన్న కోరిక ఆయనలో వుంది. రోడ్లు, భవననిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను గుర్తించేందుకు జిల్లాలోని ప్రతి రెవిన్యూ డివిజన్‌లో క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయనున్నారు.

## జడ్పీ ఛైర్మన్ చొరవతో నిధుల మంజూరు

వీటికితోడు గ్రామీణ ప్రాంతాల్లో బాగా దెబ్బతినిపోయిన రోడ్ల పునర్నిర్మాణం కోసం 10 కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం క్రింద ఈ నిధులు మంజూరయ్యాయి. ఈ పథకంలో భాగంగా నిర్మించే తారురోడ్లకు ఐదేళ్ల గ్యారంటీని కాంట్రాక్టర్లు ఇవ్వాలి. ఎన్‌డిఏ ప్రభుత్వ హయాంలో ఈ పథకం క్రింద చేపట్టిన రోడ్లు బాగా దెబ్బతినిపోయాయి. ఈసారి ఆ విధంగా కాకుండా వుండాలనే కావలి, గూడూరు, నెల్లూరు డివిజన్లలో క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

## సాయం కోసం మావోయిస్టు వినతి!

లొంగిపోయిన నక్సలైట్లకు ప్రభుత్వ సాయం అందజేత జిల్లాలో అమలు కావడం లేదు. దక్కిలి మండలం అల్తూరుపాడుకు చెందిన గద్దల మునెయ్య

తొరవ 14వ పేజీలో



పేరుకే పెద్ద కార్యాలయం.

# అక్రమార్కులపై విజిలెన్స్ ప్రత్యేక ప్రేమ!

ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్ను చెల్లించకుండా అక్రమంగా ధాన్యం, ఇతర నిత్యావసరవస్తువులు పక్క రాష్ట్రాలకు తరలించే వారిపై చర్యలు తీసుకోవాల్సిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు శాఖాధికారులు లంచాలు మెక్కి అక్రమార్కులపై ప్రత్యేక ప్రేమ చూపిస్తున్నారు. దీంతో ప్రతిరోజా 200లకుపైగా ధాన్యం, బియ్యం లారీలు, వందకుపైగా వివిధ నిత్యావసరాలతో జాక్‌పాట్ లారీలు, గ్రానైట్‌లోడుతో పదుల సంఖ్యలో లారీలు సరిహద్దులు దాటి వెళ్తున్నాయి. పైన పేర్కొన్న అక్రమ వ్యాపారాలే కాకుండా నిబంధనలు వుల్లంఘించి అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్న వారి వద్ద నుంచి ఓ విజిలెన్స్ సిఐ పెద్దఎత్తున మామూళ్ల వసూలు చేస్తున్నట్లు తెలి

## నెల మామూళ్లే కారణం

సింది. ధాన్యం, బియ్యం, పప్పులు, వంటనూనెలు అక్రమంగా నిల్వచేసిన గోడౌన్లపై విజిలెన్స్ అధికారులు దాడులు చేసి చాలారోజులయ్యింది. జిల్లాలో అక్రమ వ్యాపారం చేసే ప్రతి ఒక్కరి వివరాలు విజిలెన్స్ అధికారులు సేకరించారు. కాని వారి మీద దాడులు, ఇతర చర్యలు చేపట్టకుండా నెల మామూళ్లు తీసుకొని ఊరుకొంటున్నారు. దీనివల్లే ధాన్యం విస్తారంగా పండే జిల్లాలో కిలో బియ్యం 35 రూపాయలుగా అమ్ముతున్నారు. నూనె, ఇతర పప్పుల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. విజిలెన్స్ అధికారులు సక్రమంగా డ్యూటీ చేస్తే జిల్లాలో కొండెక్కిన ధాన్యం, బియ్యం, నిత్యావసర వస్తువుల ధరలు దిగివస్తాయి.

# నిరుపయోగంగా కంప్యూటర్లు!



విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వివిధ పాఠశాలలకు కంప్యూటర్లను సరఫరా చేసింది. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు వాటిని ఉపయోగిస్తుండగా, అధిక సంఖ్యలో మాత్రం నిరుపయోగంగా వుంటున్నాయి. కొత్తూరులోని విద్యార్థులకు ఏమాత్రం ఉపయోగపడకపోగా వాటిని పెట్టుకొనే సౌకర్యం లేదన్న సాకుతో పంచాయితీ కార్యాలయానికి మాత్రం పరిమితం కావడం అధికారులకు గల శ్రద్ధను, బాధ్యతారాహిత్యాన్ని తెలియజేస్తున్నది. హైస్కూలు, ప్రాథమిక పాఠశాల రెండూ ఒకే ఆవరణలో వున్న ఇక్కడ ఆరు నెలల క్రిందట కంప్యూటర్లను అందజేశారు. అయితే వాటిని పెట్టుకొనేందుకు ప్రత్యేకగది లేదనే సాకుతో పంచాయితీ కార్యాలయానికి వాటినిచేర్చారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులులేని పరిస్థితులలో కంప్యూటర్లు ఎక్కడ ఏర్పాటు చేయాలా అని తలలు పట్టుకొంటున్నారు. ఫలితంగా

## సౌకర్యాల లేమి!

పెట్టెలలోనే వుండిపోవడంతో పిల్లలకు కంప్యూటర్ విద్య అందని ద్రాక్షలా మారింది. హైస్కూల్‌కు అదనపు గదులు, సౌకర్యాల కల్పనపై అధికారులు దృష్టి సారించకపోవడం విద్యార్థుల పాలిట శాపంగా పరిణమించింది.

# రేషన్ కూపన్ల కోసం నానాపాట్లు!





పావలా కోడికి ముప్పావలా మసాలా అన్నట్లుగా తయారైంది రేషన్ కార్డుదారుల పరిస్థితి. మూడు నెలల రేషన్ పొందేందుకు అవసరమైన కూపన్‌లను అందించేందుకు నగరంలో రెవిన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. వాటిని పొందేందుకు కార్డు కల్గిన వినియోగదారులు మాత్రం నానా తిప్పలు

## మారని రెవిన్యూ సిబ్బంది

పడాల్సివస్తోంది. విఆర్వో, ఇతర రెవిన్యూ సిబ్బంది చెప్పిన ప్రకారం కూపన్‌లను పంచకపోవడంతో గంటల తరబడి వాటి కోసం ఎదురుచూడాల్సి వస్తున్నదని రెవిన్యూ సిబ్బంది ఎప్పుడు వాటిని అందజేస్తారో తెలియని పరిస్థితి నెలకొనిందని కార్డువినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెలలో బియ్యం పంపిణీ మొదలైనా కూపన్లు లేకపోవడంతో చౌకదుకాణాలలో బియ్యం అందని పరిస్థితి నెలకొనింది. కూలీనాలీ చేసుకొనే వారు నష్టపోయి వాటి కోసం ఎదురుచూస్తున్నా చేతికి కూపన్లు రావడం లేదు. మూలాపేట, గాంధీనగర్, నవాబుపేట తదితర ప్రాంతాలలో వినియోగదారులు ఈ విషయమై ఆందోళన చేపట్టారు.

## పోలీసులు అప్రమత్తం!

దక్షిణ భారత దేశంలో దాడులు చేయను ముగ్గురు తీవ్రవాదులు దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌లో న్యూఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకొన్నారన్న ఇంటెలిజెన్స్ హెచ్చరికతో నెల్లూరు పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లాలో తీవ్రవాదులు దాడి జరిపే అవకాశమున్న ముఖ్య కేంద్రాలు

తొరవ 14వ పేజీలో

# విలీనంతో మేలు జరిగేనా?

జిల్లాలోని కార్పొరేషన్, మునిసిపాలిటీలకు సమీపంలో వున్న గ్రామ పంచాయితీలను పట్టణ ప్రాంతాల్లో కలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం వుత్తర్వులు జారీ చేసింది. ఈ నెలాఖరులోగా దీనికి సంబంధించిన ప్రతిపాదనలు పంపడంలో అధికారులు మూడు కిలో మీటర్ల పరిధిలోని గ్రామాలు, కాలనీల చిట్టా తయారీలో నిమగ్నమై వున్నారు. పులపాలకశాఖామంత్రి జిల్లావాసి కావడంతో నెల్లూరు, కావలి, గూడూరు, వెంకటగిరి మునిసిపల్ కమిషనర్లతో ఈ విషయమై జిల్లా కలెక్టర్ ఓసారి సమావేశమయ్యారు. విచిత్రమేమిటంటే జిల్లాలోని అన్ని మునిసిపల్ పట్టణాలను నిధుల కొరత వేధిస్తోంది. అభివృద్ధి పనులు అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి. వుద్యోగులు జీతాలు లేక అల్లాడుతున్నారు. ఈ పరిస్థితుల్లో గ్రామాలను కలపడం మూలంగా వారికి ఒనగూరే సౌకర్యాలకన్నా చెల్లించాల్సిన పన్నులే ఎక్కువగా వుండవచ్చు. నెల్లూరు కార్పొరేషన్ చుట్టుప్రక్కల గ్రామాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకొనేలా చేయను పది నుంచి 12 గ్రామాలను దీని పరిధిలోనికి తెచ్చేందుకు నేతలు చక్రం తిప్పుతున్నారు. మిగతా మునిసిపాలిటీల్లో ఈ ప్రకటన పట్ల పెద్దగా హర్షం వ్యక్తం చేసేవాళ్లు లేరు.

**శివారు పంచాయితీలను మునిసిపాలిటీల్లో కలిపేస్తున్నారు.**

## పర్యావరణాన్ని పరిరక్షించుకొందాం!

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నెల్లూరులోని భారతీయ వైజ్ఞానిక సంఘ్ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. దీనిలో భాగంగా ఆదిత్యనగర్ నుంచి అంబేద్కర్ బొమ్మ వరకు ఘనంగా స్కూల్ పిల్లలతో ర్యాలీ చేపట్టింది. ఈ ర్యాలీ

తొరవ 14వ పేజీలో


శ్రీరస్తు ! శుభమస్తు !! అవిఘ్నమస్తు!!!



జగన్మాత శ్రీవెంగమాంబ దేవాలయము

నర్రవాడ - దుత్తలూరు (మండలం) నెల్లూరు జిల్లా

జగన్మాత శ్రీవెంగమాంబ అమ్మవారి

నూతన శిలా బింబ ప్రతిష్ఠ,

మహా కుంభాభిషేక మహోత్సవ





ఆహ్వానము

14-6-2009 ఆదివారం ఉదయం 9 గం॥ 10-30 ని॥లోగా

జగన్మాత శ్రీ వెంగమాంబ అమ్మవారి నూతన బింబ మహా కుంభాభిషేక మహోత్సవము జరుగును.

తేది 12-6-2009 శుక్రవారం నుండి 14-6-2009 ఆదివారం వరకు యజ్ఞ కార్యక్రమములు జరుగును.

జగద్గురు కంచి కామకోటి మూలామ్నాయ సర్వజ్ఞ పీఠాధిపతులు పరమహంస పరివ్రాజకాచార్యులు, జగద్గురువులు

శ్రీ శ్రీ శ్రీ జయేంద్ర సరస్వతీ మహాస్వామి వారు

తమ దివ్య కర కమలములచే మహా కుంభాభిషేక మహోత్సవము నిర్వహించెదరు.

కార్యక్రమములు

తేది 12-6-2009

తేది 13-6-2009

తేది 14-6-2009

తేది 14-06-2009 మధ్యాహ్నం గం.11-30 ని. ల నుండి అన్నదాన కార్యక్రమం జరుగును.

కావున యావన్మంది భక్తులు ఈ కార్యక్రమములలో పాల్గొని శ్రీ అమ్మవారి కృపకు పాత్రులు అగుదురని భక్తి పూర్వకంగా ఆహ్వానిస్తున్నాం.

మాదాల తిమ్మయ్య

మాదాల జానకిరామ్

మాదాల రాములమ్మ మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్, నర్రవాడ.

## 2009 నెల్లూరురూరల్ నియోజకవర్గ ఓట్ల వివరాలు

| పోలింగ్ కేంద్రం | పోలైన ఓట్లు | కాంగ్రెస్ | పిఆర్‌పి | సిపిఎం | మెజార్టీ |
|---|---|---|---|---|---|
| కొండ్లపూడి | 1023 | 523 | 374 | 75 | 149 |
| కందమూరు | 1015 | 530 | 201 | 211 | 329 |
| అంబాపురం | 1013 | 444 | 415 | 104 | 29 |
| గొల్లకందుకూరు | 1006 | 393 | 294 | 262 | 99 |
| కనుపర్తిపాడు | 1001 | 436 | 309 | 179 | 127 |
| కోడూరుపాడు | 980 | 396 | 336 | 150 | 60 |
| నారాయణరెడ్డిపేట | 972 | 434 | 258 | 232 | 176 |
| నారాయణరెడ్డిపేట | 972 | 466 | 246 | 202 | 220 |
| కల్లూరుపల్లి | 942 | 272 | 371 | 249 | 99 |
| దేవరపాళెం | 902 | 271 | 281 | 286 | 10 |
| చింతారెడ్డిపాళెం | 874 | 526 | 282 | 30 | 244 |
| రోమన్ క్యాథలిక్ స్కూల్ | 872 | 389 | 308 | 125 | 81 |
| అల్లీపురం | 870 | 312 | 188 | 311 | 124 |
| సౌత్‌మోపూరు తూర్పు | 865 | 299 | 227 | 262 | 72 |
| సౌత్‌మోపూరు దక్షిణం | 863 | 292 | 268 | 268 | 24 |
| అల్లీపురం పడమటివైపు | 853 | 250 | 206 | 330 | 44 |
| వెల్లంటి | 835 | 281 | 229 | 288 | 52 |
| పొట్టేపాళెం | 835 | 287 | 276 | 241 | 11 |
| ములుమూడి 1వ రూము | 833 | 443 | 133 | 236 | 310 |
| ములుమూడి 2వ రూము | 829 | 486 | 109 | 198 | 377 |
| కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు | 827 | 243 | 296 | 207 | 53 |
| రోమన్ క్యాథలిక్ స్కూల్ | 819 | 327 | 331 | 128 | 4 |
| కాకుపల్లి | 817 | 305 | 227 | 211 | 78 |
| పొట్టేపాళెం | 815 | 349 | 266 | 150 | 83 |
| చింతారెడ్డిపాళెం | 809 | 430 | 291 | 53 | 139 |
| బి.వి. నగర్ | 787 | 274 | 273 | 97 | 1 |
| పెద్దచెరుకూరు | 780 | 528 | 81 | 149 | 447 |
| రామలింగాపురం | 779 | 293 | 290 | 83 | 3 |
| ధనలక్ష్మీపురం | 771 | 362 | 300 | 57 | 62 |
| పడారుపల్లి | 749 | 226 | 255 | 184 | 29 |
| భక్తవత్సలనగర్ | 744 | 248 | 267 | 140 | 19 |
| నారాయణరెడ్డిపేట | 744 | 268 | 259 | 179 | 9 |
| బుజబుజనెల్లూరు | 743 | 299 | 249 | 123 | 50 |
| కొండాయపాళెం | 728 | 301 | 254 | 126 | 47 |
| పెద్దచెరుకూరు | 726 | 482 | 92 | 129 | 390 |
| సౌత్‌మోపూరు | 725 | 241 | 274 | 152 | 33 |
| నారాయణరెడ్డిపేట | 724 | 272 | 224 | 162 | 48 |
| వావిలేటిపాడు | 717 | 324 | 301 | 61 | 23 |
| బి.వి. నగర్ | 710 | 284 | 264 | 130 | 16 |
| గుడిపల్లిపాడు | 706 | 235 | 202 | 231 | 33 |
| ఫత్తేఖాన్‌పేట | 691 | 286 | 250 | 84 | 36 |
| వేదాయపాళెం | 688 | 170 | 273 | 210 | 103 |
| మాదరాజగూడూరు | 688 | 273 | 205 | 176 | 68 |
| రామకోటయ్యనగర్ | 684 | 257 | 276 | 97 | 19 |
| బుజబుజనెల్లూరు | 678 | 311 | 230 | 97 | 81 |
| గుడిపల్లిపాడు | 674 | 231 | 119 | 279 | 32 |
| ధనలక్ష్మీపురం | 673 | 261 | 338 | 43 | 77 |
| మాదరాజగూడూరు | 667 | 17 | 111 | 248 | 94 |
| కస్తూరిదేవి హైస్కూలు | 666 | 264 | 236 | 91 | 28 |
| శ్రీలంక కాలనీ | 665 | 194 | 325 | 101 | 131 |
| బుజబుజనెల్లూరు | 662 | 254 | 211 | 167 | 43 |
| దర్గామిట్ట | 660 | 314 | 257 | 50 | 57 |
| పడారుపల్లి | 660 | 127 | 196 | 306 | 69 |
| చంద్రమౌళినగర్ | 658 | 258 | 266 | 61 | 8 |
| కొత్తవెల్లంటి | 653 | 285 | 141 | 158 | 144 |
| వడ్డిపాళెం | 653 | 270 | 201 | 147 | 69 |
| అప్పయ్య కండ్రిగ | 649 | 298 | 166 | 152 | 132 |
| పెనుబర్తి | 643 | 263 | 148 | 197 | 115 |
| వేదాయపాళెం | 640 | 124 | 202 | 285 | 78 |
| పొదలకూరురోడ్డు | 637 | 206 | 274 | 113 | 68 |
| కొత్తవెల్లంటి | 636 | 250 | 166 | 158 | 84 |
| పడారుపల్లి | 633 | 116 | 204 | 265 | 88 |
| ఆమంచర్ల | 625 | 132 | 196 | 259 | 64 |
| గాంధీనగర్ | 621 | 183 | 247 | 129 | 64 |
| పెనుబర్తి | 620 | 255 | 143 | 193 | 112 |
| సజ్జాపురం | 616 | 340 | 144 | 88 | 196 |
| నవలాకులతోట | 614 | 202 | 166 | 170 | 36 |

## 2009 నెల్లూరురూరల్ నియోజకవర్గ ఓట్ల వివరాలు

| పోలింగ్ కేంద్రం | పోలైన ఓట్లు | కాంగ్రెస్ | పిఆర్‌పి | సిపిఎం | మెజార్టీ |
|---|---|---|---|---|---|
| పడారుపల్లి | 610 | 197 | 203 | 160 | 6 |
| వెంగళరావునగర్ | 609 | 229 | 236 | 61 | 7 |
| కొండాయపాళెం | 606 | 236 | 227 | 85 | 9 |
| దొంతాలి | 604 | 323 | 119 | 143 | 114 |
| నెహ్రూజీ నిలయం | 602 | 208 | 271 | 64 | 63 |
| కొమ్మరపూడి | 601 | 282 | 97 | 181 | 185 |
| కోడూరుపాడు | 600 | 191 | 216 | 127 | 25 |
| బి.వి.నగర్ | 598 | 233 | 209 | 71 | 24 |
| మూలాపేట | 596 | 194 | 314 | 37 | 120 |
| పద్మావతిసెంటర్ | 593 | 225 | 214 | 113 | 11 |
| ఆమంచర్ల | 591 | 144 | 176 | 233 | 32 |
| వేదాయపాళెం | 590 | 182 | 215 | 120 | 33 |
| కనుపర్తిపాడు | 587 | 284 | 143 | 122 | 141 |
| వేదాయపాళెం | 584 | 190 | 262 | 77 | 72 |
| మూలాపేట | 580 | 180 | 309 | 59 | 129 |
| బి.వి. నగర్ | 577 | 226 | 206 | 97 | 20 |
| దర్గామిట్ట | 576 | 318 | 178 | 49 | 140 |
| వేదాయపాళెం | 575 | 227 | 233 | 78 | 6 |
| కొత్తూరు 5వరోడ్డు | 574 | 218 | 216 | 99 | 2 |
| కొత్తూరు 10వరోడ్డు | 573 | 199 | 237 | 88 | 38 |
| రామలింగాపురం | 570 | 224 | 200 | 101 | 24 |
| చంద్రమౌళినగర్ | 569 | 186 | 262 | 78 | 76 |
| పల్లిపాళెం | 567 | 171 | 238 | 118 | 67 |
| పొదలకూరురోడ్డు | 563 | 227 | 259 | 43 | 32 |
| కొండాయపాళెం | 562 | 215 | 232 | 78 | 17 |
| వేదాయపాళెం | 561 | 182 | 246 | 84 | 64 |
| వెంగళరావునగర్ | 561 | 167 | 284 | 62 | 117 |
| వేదాయపాళెం | 58 | 156 | 302 | 56 | 146 |
| రెవెన్యూకాలని | 557 | 263 | 173 | 53 | 90 |
| బి.వి.నగర్ | 555 | 187 | 185 | 100 | 2 |
| కొత్తూరు | 553 | 160 | 231 | 114 | 72 |
| బొల్లినేని హాస్పటల్ | 553 | 217 | 217 | 73 | 0 |
| ఫత్తేఖాన్‌పేట | 553 | 258 | 198 | 47 | 60 |
| వేదాయపాళెం | 548 | 179 | 250 | 74 | 71 |
| రెవెన్యూకాలనీ | 547 | 254 | 172 | 48 | 82 |
| కలివెలపాళెం | 546 | 209 | 213 | 85 | 4 |
| కలివెలపాళెం | 545 | 213 | 221 | 79 | 8 |
| పద్మావతిసెంటర్ | 542 | 170 | 194 | 131 | 24 |
| బుజబుజనెల్లూరు | 541 | 186 | 184 | 136 | 2 |
| కర్ణాలమిట్ట | 541 | 180 | 223 | 110 | 43 |
| దర్గామిట్ట | 540 | 189 | 249 | 38 | 60 |
| మూలాపేట | 539 | 250 | 203 | 52 | 47 |
| తట్టుగొల్లపాళెం | 539 | 194 | 153 | 158 | 41 |
| బి.వి.నగర్ | 538 | 167 | 248 | 68 | 81 |
| డిపిఇపి స్కూలు | 537 | 246 | 212 | 50 | 34 |
| సౌత్‌రాజుపాళెం | 537 | 321 | 174 | 20 | 147 |
| వెంగళరావునగర్ | 536 | 163 | 242 | 71 | 79 |
| నవలాకులతోట | 528 | 168 | 150 | 143 | 18 |
| బి.వి.నగర్ | 526 | 178 | 528 | 42 | 80 |
| సౌత్‌రాజుపాళెం | 526 | 304 | 185 | 14 | 119 |
| బి.వి.నగర్ | 523 | 156 | 222 | 80 | 66 |
| దర్గామిట్ట | 522 | 189 | 229 | 59 | 40 |
| కర్ణాలమిట్ట | 521 | 175 | 167 | 136 | 8 |
| వెంగళరావునగర్ | 518 | 188 | 198 | 92 | 10 |
| శ్రీలంక కాలనీ | 517 | 118 | 270 | 104 | 152 |
| బి.వి.నగర్ | 516 | 157 | 201 | 115 | 44 |
| తట్టుగొల్లపాళెం | 512 | 213 | 113 | 163 | 100 |
| గుండ్లపాళెం | 511 | 204 | 197 | 78 | 7 |
| బుజబుజనెల్లూరు | 510 | 160 | 183 | 151 | 23 |
| వేదాయపాళెం | 510 | 163 | 193 | 85 | 30 |
| బుజబుజనెల్లూరు | 508 | 165 | 155 | 161 | 10 |
| పొదలకూరురోడ్డు | 506 | 210 | 174 | 77 | 36 |
| ఫత్తేఖాన్‌పేట | 504 | 199 | 200 | 60 | 1 |
| వెంగళరావునగర్ | 502 | 163 | 187 | 91 | 24 |
| నవలాకులతోట | 502 | 127 | 172 | 163 | 45 |
| పొదలకూరురోడ్డు | 501 | 154 | 250 | 72 | 96 |
| నవలాకులతోట | 500 | 156 | 168 | 142 | 12 |

## 2009 నెల్లూరురూరల్ నియోజకవర్గ ఓట్ల వివరాలు

| పోలింగ్ కేంద్రం | పోలైన ఓట్లు | కాంగ్రెస్ | పిఆర్‌పి | సిపిఎం | మెజార్టీ |
|---|---|---|---|---|---|
| రామకోటయ్యనగర్ | 497 | 188 | 186 | 74 | 2 |
| కేశవులునగర్ | 497 | 151 | 187 | 103 | 36 |
| ఏ.సి స్టేడియం | 496 | 208 | 190 | 39 | 18 |
| కొండాయపాళెం | 496 | 224 | 129 | 98 | 95 |
| భక్తవత్సలనగర్ | 496 | 222 | 133 | 88 | 89 |
| కొండాయపాళెం | 494 | 160 | 186 | 92 | 26 |
| పొదలకూరురోడ్డు | 490 | 166 | 241 | 61 | 75 |
| రామలింగాపురం | 489 | 209 | 164 | 77 | 45 |
| రామలింగాపురం | 486 | 201 | 153 | 86 | 48 |
| వెంకటరెడ్డినగర్ | 485 | 216 | 196 | 42 | 20 |
| శ్రీ సర్వోదయకాలేజి | 483 | 225 | 169 | 61 | 56 |
| రామలింగాపురం | 479 | 209 | 143 | 71 | 66 |
| పద్మావతిసెంటర్ | 478 | 137 | 203 | 89 | 66 |
| వేదాయపాళెం | 473 | 121 | 246 | 69 | 125 |
| ఏ.సి స్టేడియం | 473 | 170 | 207 | 41 | 37 |
| కొత్తూరు | 471 | 112 | 221 | 101 | 109 |
| రామలింగాపురం | 471 | 215 | 156 | 41 | 59 |
| కల్లూరుపల్లి | 468 | 132 | 159 | 137 | 27 |
| వేదాయపాళెం | 465 | 145 | 185 | 60 | 40 |
| పొదలకూరురోడ్డు | 464 | 159 | 215 | 56 | 56 |
| పద్మావతిసెంటర్ | 460 | 152 | 226 | 62 | 74 |
| ఫత్తేఖాన్‌పేట | 457 | 177 | 207 | 36 | 30 |
| వెంకటరెడ్డినగర్ | 455 | 149 | 211 | 40 | 62 |
| దర్గామిట్ట | 447 | 188 | 187 | 52 | 1 |
| దొడ్లచెంచురామిరెడ్డిస్కూలు | 447 | 166 | 160 | 91 | 6 |
| రామలింగాపురం | 445 | 184 | 156 | 46 | 28 |
| నవలాకులతోట | 445 | 91 | 161 | 163 | 70 |
| బొల్లినేని హాస్పిటల్ | 444 | 167 | 183 | 42 | 16 |
| వెంగళరావునగర్ | 444 | 118 | 179 | 88 | 61 |
| వేదాయపాళెం | 441 | 133 | 192 | 84 | 59 |
| చంద్రమౌళినగర్ | 441 | 160 | 181 | 45 | 21 |
| బి.వి.నగర్ | 441 | 127 | 156 | 64 | 29 |
| ఫత్తేఖాన్‌పేట | 439 | 232 | 162 | 20 | 70 |
| బుజబుజనెల్లూరు | 434 | 128 | 127 | 148 | 1 |
| భక్తవత్సలనగర్ | 430 | 168 | 136 | 79 | 32 |
| మూలాపేట | 422 | 174 | 167 | 52 | 7 |
| వెంగళరావునగర్ | 421 | 123 | 186 | 72 | 63 |
| వేదాయపాళెం | 419 | 168 | 150 | 68 | 18 |
| పొదలకూరురోడ్డు | 419 | 182 | 149 | 46 | 33 |
| ఉప్పుటూరు | 417 | 177 | 124 | 10 | 53 |
| ఫత్తేఖాన్‌పేట | 412 | 168 | 168 | 36 | 0 |
| ఆమంచర్ల | 408 | 149 | 116 | 111 | 33 |
| వేదాయపాళెం | 408 | 132 | 181 | 46 | 49 |
| భక్తవత్సలనగర్ | 401 | 147 | 139 | 62 | 8 |
| కల్లూరుపల్లికాలనీ | 400 | 139 | 130 | 82 | 9 |
| దర్గామిట్ట | 398 | 141 | 182 | 47 | 41 |
| మన్నవరప్పాడు | 397 | 201 | 96 | 77 | 105 |
| కర్ణాలమిట్ట | 397 | 146 | 146 | 70 | 0 |
| దర్గామిట్ట | 392 | 166 | 154 | 36 | 12 |
| పొదలకూరురోడ్డు | 390 | 183 | 129 | 50 | 54 |
| కస్తూరిదేవిస్కూలు | 383 | 135 | 138 | 79 | 3 |
| దొడ్లచెంచురామిరెడ్డిస్కూలు | 381 | 146 | 151 | 39 | 5 |
| కోడూరుపాడు | 381 | 174 | 106 | 63 | 68 |
| పొదలకూరు | 377 | 130 | 164 | 38 | 34 |
| వేదాయపాళెం | 375 | 147 | 148 | 42 | 1 |
| దొడ్లచెంచురామిరెడ్డిస్కూలు | 375 | 157 | 147 | 28 | 10 |
| ఫత్తేఖాన్‌పేట(సర్వోదయ) | 372 | 133 | 166 | 48 | 33 |
| పొదలకూరురోడ్డు | 371 | 135 | 162 | 52 | 27 |
| రామలింగాపురం | 369 | 177 | 123 | 29 | 54 |
| పొదలకూరురోడ్డు | 365 | 142 | 122 | 57 | 20 |
| వేదాయపాళెం | 351 | 83 | 121 | 128 | 38 |
| పొదలకూరురోడ్డు | 351 | 144 | 144 | 27 | 0 |
| భక్తవత్సలనగర్ | 351 | 116 | 138 | 52 | 22 |
| ఫత్తేఖాన్‌పేట(సర్వోదయ) | 346 | 139 | 126 | 42 | 13 |
| డి.కె.డబ్ల్యు | 346 | 132 | 157 | 35 | 25 |
| పొదలకూరురోడ్డు | 344 | 139 | 143 | 31 | 4 |
| బి.వి.నగర్ | 343 | 123 | 117 | 68 | 6 |

తరువాయి 14వ పేజీలో

# మరువలేము... మిత్రమా!



## డాక్టర్ ఎర్రంరెడ్డి ప్రసాద్‌రెడ్డి MDS

మేనేజింగ్ డైరక్టర్ - అపోలో డెంటల్ హాస్పిటల్స్, చెన్నై.

మంచి మాటవల్లే మంచి మిత్రులు లభిస్తారు
అన్ని వేళలా పది మంది మంచి కోసం పరితపించిన
నీవు లేకుండా పోయావంటే నమ్మలేకున్నాం...
విధిరాతను ఎవరూ తప్పించలేకపోవచ్చు
కాని స్నేహమేరా జీవితం...
స్నేహమేరా శాశ్వతమంటూ...
మా హృదయాలలో నీ జ్ఞాపకాలు పదిలం.

**జి. శశిధర్‌రెడ్డి**
చెన్నై

**కె. నరసారెడ్డి**
కెన్సెస్ గ్రూప్, చెన్నై

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.